నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 23 ఆగస్టు 2024 | KARIMNAGAR

చిగురుమామిడి: చిన్న ముల్కనూర్‌లో రాస్తారోకో చేస్తున్న మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, బీఆర్ఎస్ నాయకులు

వేములవాడ: ధర్నాలో పాల్గొన్న బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి లక్ష్మీనరసింహారావు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ మాధవి

ముస్తాబాద్: మాజీ ఎంపీపీ జనగామ శరత్‌రావును లాక్కెళ్తున్న పోలీసులు

గంగాధర పోలీస్ స్టేషన్‌లో ఉన్న నరేందర్ రెడ్డి

బీఆర్ఎస్ నేతలపై ఉక్కుపాదం!

- ఆందోళనల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన వారిపై పోలీసుల నజర్
- చొప్పదండిలో పలువురి అరెస్ట్ • అకారణంగా గంగాధర ఠాణాలో ఒకరి నిర్బంధం • కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లే కారణమంటున్న గులాబీ నేతలు

కరీంనగర్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ): రుణ మాఫీ విషయంలో రైతుల నుంచి ప్రభుత్వంపై పెద్ద ఎత్తున నిరసన వ్యక్తమవుతున్నది. ఇది రోజు రోజుకూ ఉధృతమవుతున్నది. రైతులకు బీఆర్ఎస్ తోడైతే భవిష్యత్తులో మరింత తీవ్ర రూపు దాల్చే ప్రమాదం ఉందని ప్రభుత్వ నేతలు భావించి, ఆదిలోనే ఉక్కుపాదం మోపాలని చూస్తున్నట్టు తెలుస్తున్నది. తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన ఆందోళనలకు రైతుల నుంచి సంపూర్ణ మద్దతు లభించింది. చొప్పదండిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మకు శవయాత్ర చేసిన అనంతరం దహనం చేస్తున్న సందర్భంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదం జరిగింది. పరిస్థితిని అదుపు చేసే క్రమంలో పోలీసులు మాజీ ఎమ్మెల్యే రవిశంకర్‌తోపాటు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి తదితరులను అదుపులోకి తీసుకుని వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. ఎక్కడి వాళ్లు అక్కడికి వెళ్లిపోయారు. ఇంత వరకు బాగానే ఉన్నా.. ఆందోళన సద్దుమణిగిన తర్వాత పోలీసులు అరెస్టులకు దిగడం చర్చనీయాంశంగా మారింది. రాత్రి సమయంలో ఓ నాయకుడిని అరెస్టు చేయడం కలకలం రేపింది. అయితే కాంగ్రెస్ నాయకులు జోక్యం చేసుకోవడంతోనే తమ పార్టీ నాయకులను అరెస్టు చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. నిజానికి మధ్యాహ్నం జరిగిన ఘటనలు అంత సీరియస్‌గా ఉంటే అప్పుడే అదుపులోకి తీసుకొని కేసులు పెట్టే అవకాశముండేదని, కానీ, గురువారం రాత్రి ఎందుకు అరెస్టులు చేయాల్సి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. దీని వెనుక కాంగ్రెస్ నాయకుల ఒత్తిళ్లు ఉన్నాయని స్పష్టం చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నం జరిగిన ఆందోళనలో క్రియాశీలకంగా వ్యవహరించిన బీఆర్ఎస్ నాయకుడు ఏనుగు రవీందర్ రెడ్డిని ఇదే రోజు రాత్రి కరీంనగర్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఆందోళనలో పాల్గొన్న చొప్పదండి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆరెల్లి శేఖర్ ఆచూకీ లభించడం లేదని, ఆయనను కూడా పోలీసులే అరెస్ట్ చేసి ఉంటారని బీఆర్ఎస్ నాయకులు అనుమానిస్తున్నారు. తెలంగాణ ఉద్యమ సమయంలో క్రియాశీలకంగా వ్యవహరించిన ఏనుగు రవీందర్ రెడ్డిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేయడం ఏమిటనేది అర్థంకాకుండా ఉండగా.. పాత కేసుల్లో అతన్ని అరెస్టు చేశామని పోలీసులు చెబుతున్నారు. ఆయనపై చొప్పదండిలో పోలీసులతో వాగ్వాదం కేసు కూడా నమోదు చేసి ఉంటారని బీఆర్ఎస్ నాయకులు భావిస్తున్నారు. బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షులు వెల్మ శ్రీనివాస్ రెడ్డి, కొండగట్టు దేవస్థానం మాజీ డైరెక్టర్ గన్ను శ్రీనివాస్ రెడ్డిని కూడా చొప్పదండి పోలీసులు గురువారం రాత్రి అరెస్టు చేశారు. వీరిద్దరు ఇప్పుడు ఇదే పోలీసు స్టేషన్‌లో ఉన్నట్లు తెలుస్తున్నది. చొప్పదండి నిరసనలో పాల్గొన్న ఆర్నకొండ సింగిల్ విండో చైర్మన్ మినుపాల తిరుపతి రావుతో పాటు మరి కొందరిపై కేసులు నమోదు చేసేందుకు పోలీసులు రంగం సిద్ధం చేసినట్లు తెలిసింది.

బీఆర్ఎస్ నాయకులపై పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారా..? రైతు రుణమాఫీ కోసం చేస్తున్న ఆందోళనల్లో క్రియాశీలకంగా వ్యవహరించిన వారిపై ఫోకస్ చేశారా..? కాంగ్రెస్ నేతల ఒత్తిళ్లతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారా..? అంటే.. పరిస్థితులను చూస్తే అవుననే తెలుస్తున్నది. రుణమాఫీపై రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్న నేపథ్యంలో ఆందోళనలను కట్టడి చేసేందుకు కాంగ్రెస్ నేతలు ఒత్తిడి తెస్తుండడంతో పోలీసులు ఒక్కొక్కరిని అరెస్టు చేసేందుకు రంగం సిద్ధం చేసినట్టు తెలుస్తున్నది. ఇప్పటికే కొందరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు మిగతా వాళ్ల కోసం గాలిస్తున్నట్టు సమాచారం అందుతున్నది.

గంటన్నరపాటు నిర్బంధించి..

చొప్పదండి నియోజకవర్గం పరిధిలోని గంగాధర పోలీసులు మల్యాల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొరండ్ల నరేందర్ రెడ్డిని గంటన్నర పాటు స్టేషన్‌లో నిర్బంధించారు. కారణం లేకుండా నిర్బంధించడంతో మీడియా వెళ్లి విచారించగా.. వేరే సాకులు చెప్పి వదిలేశారు. కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లికి చెందిన నరేందర్ రెడ్డి బుధవారం ఇదే మండలం పరిధిలోని పూడూరులో జరిగిన రైతుల ఆందోళనలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే అదుపులోకి తీసుకుని వదిలేశారని బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. సొంత పనిపై కరీంనగర్ వెళ్లిన నరేందర్ రెడ్డి రాకకోసం దాదాపు మూడు గంటల పాటు గంగాధర పోలీసులు కాపుకాచి మరీ అదుపులోకి తీసుకున్నట్లు తెలుస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో మల్యాల మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పనిచేసిన నరేందర్ రెడ్డి తన కారుపై ఇప్పటికీ మార్కెట్ కమిటీ చైర్మన్ పేరుతో ఉన్న బోర్డును ఉపయోగిస్తున్నాడని, దీనిని తొలగించాలని చెప్పేందుకే పోలీసు స్టేషన్ తీసుకెళ్లామని పోలీసులు చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నది. నిజానికి నరేందర్ రెడ్డి పూడూర్ ఆందోళనలో క్రియాశీలకంగా పాల్గొన్న కారణంగా భయానికి గురి చేసేందుకే పోలీసులు ఈ చర్యకు దిగినట్లు బీఆర్ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితోనే : జీవీఆర్

కాంగ్రెస్ నాయకుల ఒత్తిడితోనే తమ నాయకులను పోలీసులు అరెస్టు చేస్తున్నారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు స్పష్టం చేశారు. రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వంపై రైతుల్లో తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తమవుతున్నదని, బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు ఇలాగే కొనసాగితే తమ ప్రభుత్వ ఉనికి ప్రమాదమనే భయానికి గురవుతున్నారని విమర్శించారు. కాంగ్రెస్ నాయకులు పోలీసులపై ఒత్తిళ్లు తెచ్చి తమ పార్టీ నాయకులను అరెస్టు చేయిస్తున్నారని ఆరోపించారు. అరెస్టులు, కేసులు తమకు కొత్తకాదని, తెలంగాణ ఉద్యమంలో అనేక కేసులను ఎదుర్కొని రాష్ట్రాన్ని సాధించుకున్నామని, ఇప్పుడు కూడా చట్ట పరిధిలో కేసులను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

చొప్పదండి: పోలీస్‌స్టేషన్‌లో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

కరీంనగర్: ధర్నాలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, చిత్రంలో జిల్లా అధ్యక్షుడు జీవీఆర్, మేయర్ సునీల్‌రావు, మాజీ ఎమ్మెల్సీ నారదాసు, నాయకులు

రుణమాఫీ కోసం
బీఆర్ఎస్ రణం

- పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుతో పోరుబాట
- కాంగ్రెస్ సర్కారు ధోఖాపై కన్నెర్ర
- రైతులతో కలిసి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు
- నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు
- పలు మండల కేంద్రాల్లోనూ ఆందోళనలు
- పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల, మాజీ ఎంపీ వినోద్, ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులు
- రైతులందరికీ రుణమాఫీ చేయాలంటూ వినతులు
- సర్కారు దిగివచ్చే వరకూ ఉద్యమిస్తామని హెచ్చరిక

రైతులకు అండగా గులాబీదళం

రైతన్న కోసం బీఆర్ఎస్ మరోసారి పోరుబాట పట్టింది. రుణమాఫీ విషయంలో కాంగ్రెస్ సర్కారు ధోఖాపై భగ్గుమన్నది. ఈ నెల 15లోగా ఏకకాలంలో రైతులందరికీ రూ. 2లక్షల రుణమాఫీ చేస్తామని ఆశచూపి, తీరా అనేక కొర్రీలతో వేలాది మందికి మొండిచేయ్యి చూపడంపై ఆగ్రహించింది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలతో హోరెత్తించింది. వందలాదిగా తరలివచ్చిన రైతులతో కలిసి నియోజకవర్గ కేంద్రాల్లో భారీ ధర్నాలు చేసింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించింది. ఎలాంటి షరతులు లేకుండా మాఫీ చేయాలని, లేకుంటే ఊరుకునేది లేదని స్పష్టం చేసింది. రైతుల కోసం ఎంతకైనా తెగిస్తామని, సర్కారు దిగొచ్చే వరకు ఉద్యమిస్తామని హెచ్చరించింది.

-కరీంనగర్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ)

మానకొండూర్: ధర్నాలో నినదిస్తున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, రసమయి బాలకిషన్, జీవీఆర్, తదితరులు

రామడుగు: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు వీర్ల వెంకటేశ్వరరావును పక్కకు తీసుకెళ్తున్న పోలీసులు

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ అధ్యక్షతన ధర్నా చేశారు. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, మేయర్ వై సునీల్ రావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేయాలని కోరుతూ డీఆర్‌వో పవన్ కుమార్‌కు నాయకులు వినతి పత్రం అందించారు. అంతకుముందు తెలంగాణ తల్లి విగ్రహం వద్ద తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. అలాగే మానకొండూర్ నియోజకవర్గ కేంద్రంలో జరిగిన ధర్నాలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు. హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి నివాసం నుంచి నినాదాలు చేస్తూ పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అంబేద్కర్ చౌరస్తా వరకు చేరుకున్నారు. దాదాపు అరగంట పాటు అక్కడ రాస్తారోకో చేశారు. ఈ క్రమంలో పోలీసులు బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసి డీసీఎం వ్యాన్లలో పోలీసుస్టేషన్‌కు తరలించారు. చొప్పదండిలో మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు. సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మతో శవయాత్ర తీశారు. అనంతరం దిష్టిబొమ్మను దహనం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, బీఆర్ఎస్ నాయకులకు వాగ్వాదం జరిగింది. మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్‌తోపాటు జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డిని పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

హుజూరాబాద్: బీఆర్ఎస్ నాయకులను డీసీఎం వ్యానులో తరలిస్తున్న పోలీసులు

ధర్మపురి: ధర్నాలో నినదిస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

హుజూరాబాద్: ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న నాయకులు, చొప్పదండి : రాస్తారోకోలో నినదిస్తున్న మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, నాయకులు

షరతుల్లేకుండా మాఫీ చేయాలి

మాజీ ఎంపీ వినోద్‌కుమార్

కార్పొరేషన్, ఆగస్టు 22: కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని, ఎలాంటి షరతులు లేకుండా రైతులకు రుణ మాఫీని అమలు చేయాలని కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంగ్రెస్ వైఖరితో రాష్ట్రంలోని రైతులంతా పూర్తిగా నిరాశ నిస్పృహలో ఉన్నారని వాపోయారు. వారికి ధైర్యం చెప్పాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి, ఎదుటివారిపై అనాలోచితంగా మాట్లాడుతూ నిరాశలో కొట్టుమిట్టాడుతున్నారని దుయ్యబట్టారు. ఉద్యమంలో రైతులు, ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు కేసీఆర్ ప్రభుత్వం అన్నీ అమలు చేసిచూపించిందని, దేశంలో గొప్ప రాష్ట్రంగా తీర్చిదిద్దిందని కొనియాడారు. ఇన్ని చేసిన కేసీఆర్ మళ్లీ సీఎం అవుతారన్న ఆలోచనతోనే రేవంత్‌రెడ్డి ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చారని మండిపడ్డారు. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ₹40వేల కోట్లతో రుణమాఫీ చేస్తామని చెప్పిన రేవంత్ రెడ్డి, క్యాబినెట్‌లో మాత్రం ₹31వేల కోట్లు కేటాయించారని, బడ్జెట్‌లో ₹17 వేల కోట్లు కేటాయించారని, తీరా చూస్తే ₹7500 కోట్లు మాత్రమే మాఫీ చేశారని, ఇదెక్కడి లెక్క అని మండిపడ్డారు. రుణమాఫీ పూర్తిగా చేశామని రేవంత్‌రెడ్డి ప్రకటనలు చేస్తున్నారని, మరోవైపు ఆర్థిక మంత్రి ఇంకా చేయలేదు, చేస్తున్నామని మాట్లాడుతున్నారని, ఖమ్మంలో మరో మంత్రి 30 శాతం మందికే ఇచ్చామని, ఇంకా చేస్తామంటున్నారని, మాఫీ లెక్కలపై ప్రభుత్వానికే క్లారిటీ లేకపోతే ఎలా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ మోసాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేసేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలోసీజన్ ప్రారంభంలో రోహిణి కార్తెలో రైతులకు రైతుబంధు అందిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ మాత్రం పంట కోతల సమయంలో ఇచ్చిందని, ఈ యేడాది ఇంత వరకు కూడా ఇవ్వలేదని మండిపడ్డారు. ఇప్పుడు ప్రజలు, రైతులందరూ కాంగ్రెస్‌కు అధికారం ఇచ్చి తప్పు చేశామని బాధపడుతున్నారని, తాము ఎక్కడికి వెళ్లినా ఇదే విషయాన్ని మాట్లాడుతున్నారని చెప్పారు. రాష్ట్రంలో అధికార పక్షం ఎంత ముఖ్యమో ప్రతిపక్షం అంతకంటే ముఖ్యమని, కాంగ్రెస్ ఇచ్చిన మాట ప్రకారం హామీలన్నింటినీ అమలు చేసే దాకా బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని తేల్చిచెప్పారు.

కరీంనగర్: ధర్నాలో మాజీ ఎంపీ వినోద్‌కుమార్